నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 13 మార్చి 2024 | NIZAMABAD

# ఒకేరోజు 26 మంది డిబార్

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మార్చి 12: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. మంగళవారం జరిగిన ఇంటర్ సెకండియర్ పరీక్షల్లో ఒకేరోజు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 26మంది విద్యార్థులు కాపీ కొడుతూ పట్టుబడ్డారు. మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 16మంది, ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 మంది, నిజామాబాద్ నగరంలోని హరిచరణ్ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి చీటీలు చూసి రాస్తుండగా తనిఖీ బృందాలు పట్టుకొని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. జిల్లాలో మొత్తం 16633 మంది విద్యార్థులకు 16136 మంది పరీక్షలకు హాజరుకాగా, 841 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 57 పరీక్షా కేంద్రాల్లో 46 సెంటర్లను తనిఖీ చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్ విద్యాధికారి పేర్కొన్నారు. కామారెడ్డిలో జిల్లా వ్యాప్తంగా మొత్తం జనరల్ 7,543 మంది విద్యార్థులకు 7,319 మంది హాజరయ్యారు. 224 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 1,045 మందికి 1,021 మంది హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

**రంజాన్ వేళలు**

బుధవారం
ఇఫ్తార్ - 6:34

గురువారం
సహర్ - 5:15

# డిగ్రీ ఫలితాలు విడుదల

డిచ్‌పల్లి, మార్చి 12: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి, 3వ, 5వ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్‌చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.యాదగిరి మంగళవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 8634 మందికి 2030 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 3వ సెమిస్టర్‌లో 8147 మందికి 2613 మంది పాసయ్యారు. 5వ సెమిస్టర్ ఫలితాల్లో మొత్తం 9339 మందికి 3626 మంది ఉత్తీర్ణులయ్యారు. అన్ని సెమిస్టర్లలో బాలికలదే పైచేయి సాధించారు. పారదర్శకంగా వేగవంతంగా ఫలితాలను అందించడంలో మార్గనిర్దేశనం చేసిన కంట్రోలర్ ఆచార్య అరుణ, అడిషనల్ కంట్రోలర్స్ డాక్టర్ నందిని, డాక్టర్ శాంతాబాయితోపాటు అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, పరీక్షల విభాగం సిబ్బందిని రిజిస్ట్రార్ యాదగిరి అభినందించారు.

## 18 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు

# టెన్షన్ వద్దు

**ఆత్మ విశ్వాసంతో ఒత్తిడి దూరం**



**రాత బాగుంటే.. మంచి మార్కులు**

పరీక్షల్లో చదవడంతోపాటు రాత కూడా ముఖ్యం. చేతిరాత బాగుంటే 10 నుంచి 15 శాతం మార్కులు అదనంగా పొందవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

**రాసేటప్పుడు ఇవి గుర్తుంచుకోవాలి..**

- పెన్ను, పెన్సిల్ పట్టుకునే విధానం తగిన విధంగా ఉండాలి.
- ఎట్టి పరిస్థితుల్లో రెడ్, గ్రీన్ పెన్నులు వాడకూడదు. బ్లూ లేదా బ్లాక్ పెన్నులు వాడాలి.
- పదాలు, వాక్యాలు, పేరాల మధ్య తగిన స్థలం వదలాలి.
- అక్షరాలు సైజు స్పష్టంగా కనిపించేలా ఒకే తీరు ఉండాలి.
- గొలుసుకట్టు రాత, అక్షరం, భాషా దోషాలు ఉండకూడదు.
- వేగంగా రాయడం ప్రాక్టీస్ చేయాలి.

**ఇవి పాటించాలి..**

- సమాధానం రాసేముందు ప్రశ్నల నంబర్లు సరిగ్గా వేయాలి
- సమాధాన పత్రాలు ఇవ్వగానే స్కేల్ సాయంతో తగిన మార్జిన్ పెట్టుకోవాలి.
- జవాబు పత్రంపై ఒక్కో పేజీకి 16 నుంచి 18 లైన్లకు మించకుండా చూసుకోవాలి.
- ఆన్సర్ షీట్‌పై ప్రతి వాక్యం స్ట్రెయిట్‌గా ఉండేలా రాయాలి.
- ముఖ్యమైన అంశాల కింద అండర్‌లైన్ ఉండేలా చూసుకోవాలి.
- కామా, ఫుల్‌స్టాప్‌లు పాటిస్తూ రాయాలి.
- తెలుగులో అక్షరాలు గుండ్రంగా, తలకట్టు, దీర్ఘాలు, ఒత్తులు స్పష్టంగా కనిపించేలా ఉండాలి.
- ఇంగ్లిష్‌లో పదాలను స్లాంట్‌గా, స్ట్రోక్స్ పాటిస్తూ రాయాలి.
- స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చూసుకోవాలి. ఓవర్ రైటింగ్ ఉండకూడదు.
- క్యాపిటల్, స్మాల్ లెటర్స్ వ్యత్యాసం గమనిస్తూ రాయాలి.
- సైన్స్, సోషల్‌లో బొమ్మలు గీయడం లేదా పటాల్లో స్థలాలను స్పష్టంగా గుర్తించాలి.

కామారెడ్డి/కోటగిరి, మార్చి 12: విద్యార్థి జీవితాన్ని కీలకమలుపు తిప్పేది పదో తరగతి వార్షిక పరీక్షలే. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు.. వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంతో సహజంగానే ఒత్తిడి పెరుగుతుంది. మంచి మార్కులు వస్తాయో లేదోనని ఆందోళన కలుగుతుంది. ఒత్తిడిని అదిగమించి, ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. చదువుకునే వాతావరణం, తీసుకునే ఆహారంలో కొద్దిపాటి మార్పులు చేసుకోవడంతోపాటు పిల్లల్లో భయాందోళన కలగకుండా ఆత్మ విశ్వాసం నింపడంలో తల్లిదండ్రుల తోడ్పాటు ఎంతో కీలకం. నచ్చిన ప్రదేశాలు, ఇష్టమైన వ్యక్తుల సమక్షంలో చదువుకోవడం ఎంతో మేలు. విద్యార్థులు తమ టెన్షన్ దూరం చేసుకునేందుకు నిపుణులు చేస్తున్న సూచనలివీ..

**మార్కుల కోసం పిల్లల్ని వేధించకండి..**

విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలంటే తల్లిదండ్రుల పాత్ర కీలకం. వారి ప్రోత్సాహం లేకుంటే పిల్లలు ఎందులోనూ రాణించలేరు. మార్కుల పేరిట ఒత్తిడి తేవడం సరికాదు. సందేహాలుంటే వెంటనే నివృత్తి చేయాలి. బలవంతంగా తమ అభిప్రాయాలను రుద్దకూడదు. పిల్లలకు చదువు రాదని, మార్కులు తక్కువగా వస్తాయని, ఫెయిల్ అవుతారని, వారి స్నేహితుల కన్నా వెనుకపడ్డావంటూ నెగెటివ్ ధోరణితో కించపర్చొద్దు. ముఖ్యంగా ఫలితాలపై అతిగా అంచనాలు పెంచుకోవడం కూడా మంచిది కాదు. ర్యాంకులు వస్తాయని ఆశించి, ఆమేర చదవాలని ఒత్తిడి చేయెద్దు. తర్వాత ర్యాంకులు రాలేదని వేధిస్తే మానసిక స్థైర్యం కోల్పోయి ముందుకు సాగలేరు.

**మానసిక సన్నద్ధత ఇలా...**

- కేంద్రాన్ని ముందుగానే చూసుకుంటే చివరి నిమిషంలో హైరానా ఉండదు.
- పరీక్ష ముందురోజు హాయిగా నిద్రపోవాలి. నిద్ర మెదడు పనితీరును ప్రభావితం చేస్తుంది.
- పరీక్షలకు వెళ్లే ముందు పెన్ను, పెన్సిల్, ప్యాడ్, హాల్‌టికెట్‌ను సరి చూసుకోవాలి.
- ఎగ్జామ్ సమయానికి అరగంట ముందే కేంద్రానికి చేరుకునేలా ప్లాన్ చేసుకోవాలి.
- కొత్త వాతావరణంలో ఉన్నామనే భయాన్ని వదిలేయాలి.
- ప్రశ్నలన్నింటినీ క్షుణ్ణంగా చదివి, బాగా రాయగలననుకున్న ఆరేడు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. చివరగా ఎంపిక చేసుకున్న ప్రశ్నలకు జవాబులు రాయడం మంచిది.

**ఆరు గంటల నిద్ర అవసరం..**



బాగా తినాలి.. బాగా చదవాలి.. బాగా పరీక్షలు రాయాలి. ఈ మూడు అంశాలను విద్యార్థులు దృష్టిలో పెట్టుకోవాలి. పరీక్షల్లో బాగా రాయాలనే ఆత్రుతతో సమయపాలన లేకుండా చదవడం మంచిది కాదు. నిద్రలేమితో మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. పరీక్షా కేంద్రాల్లో కండ్లు మూతపడుతుంటాయి. కునుకు తీయాల్సి వస్తుంది. ఏకాగ్రత కోల్పోతుంది. చదివినవి గుర్తుకురావు. సమాధానాలు సరిగా రాయలేరు. అందుకే పరిపూర్ణంగా నిద్ర పోవాలి. విద్యార్థులు రోజుకు ఆరు గంటలకు తగ్గకుండా నిద్రపోవడం తప్పనిసరి.

**ఆహారం ప్రధానం..**



ఏడాది పొడవునా బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థుల్లో కొందరు వార్షిక పరీక్షల సమయంలో అనారోగ్యానికి గురై ఫలితాల సాధనలో వెనుకబడిన సందర్భాలు అనేకం. పిల్లలు తమ ఆర్యోగాన్ని కాపాడుకోవడంతోపాటు ఒత్తిడిని దూరం చేసుకునేందుకు రోజువారీగా తీసుకునే ఆహారంలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో మాంసాహారానికి దూరంగా ఉండడం మేలు. సాత్విక ఆహారంతో శరీరానికి కావాల్సిన పోషకాలు లభించడంతోపాటు ఉత్సాహం చేకూరుతుంది. పండ్లు, కూరగాయలు తీసుకుంటే మెదడు చురుగ్గా పని చేస్తుంది. పరీక్షకు వెళ్లే సమయానికి మూడు గంటల ముందే తేలికపాటి అల్పాహారం తీసుకోవాలి. మధ్యాహ్నం, రాత్రి బలవర్ధకమైన ఆహారం తక్కువ మోతాదులో తీసుకుంటే మంచిది.



# వరి కోతలు షురూ..

**యాసంగి వరి కోతలు** ప్రారంభమయ్యాయి. నిజామాబాద్ జిల్లాలోని వర్ని, చందూర్, మోస్రా తదితర ప్రాంతాలకు రాష్ట్రంలోనే వరిసాగులో ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఇక్కడి రైతులు ప్రతి ఏడాది ప్రణాళికాబద్ధంగా వరి సాగుచేసి దిగుబడులు సాధించడంలో మంచిపేరుంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కన్నా ముందుగా వరినాట్లు వేసి ప్రకృతి వైపరీత్యాలను అధిగమిస్తూ దిగుబడులు సాధిస్తున్నారు. చందూర్ మండల కేంద్రంలో మంగళవారం చంద్రకాంత్ అనే యువరైతు కోత కోసి వచ్చిన ధాన్యాన్ని విక్రయించాడు. పచ్చివడ్లను క్వింటాలుకు రూ.2,200కు విక్రయించినట్లు తెలిపారు.

–చందూర్, మార్చి 12

# ఎన్నికలకు సిద్ధంకావాలి

## వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు



వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్





వీసీలో పాల్గొన్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, అదనపు కలెక్టర్లు

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మార్చి 12: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తూ పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్, భద్రతాపరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ జిల్లా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గత ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని, తమకు పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పించలేదని, ఏ ఒక్కరు కూడా ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం కల్పించొద్దని అన్నారు. వీసీలో నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్ గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణంలోని ప్రజాపాలన సేవా కేంద్రం ఎదుట బారులుతీరిన ప్రజలు



# ప్రజాపాలన..ప్రజల హైరానా

**గృహజ్యోతి పథకానికి** అర్హత ఉన్నా.. జీరో బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాలకు తరలివస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని మెప్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రానికి పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరాగా.. స్థానిక సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంపై మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సైతం ఇదే తీరు కనిపిస్తున్నది. ప్రతిరోజూ సేవా కేంద్రానికి వందల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి దరఖాస్తు చేసుకుంటున్నారు. జీరో బిల్లు రాకపోవడంతో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

– ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మార్చి 12



నిజామాబాద్‌లో..

## పోలీసులమని నమ్మించి

# బంగారం చోరీ

నవీపేట, మార్చి 12: మండల కేంద్రంలో మంగళవారం పట్టపగలే సినీఫక్కీలో చోరీ జరిగింది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్ కథనం మేరకు.. రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి నర్సింహస్వామి మండల కేంద్రంలోని లింగమయ్య గుట్టలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం 11 గంటలకు ఆయన మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా మాస్కులు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు నర్సింహస్వామిని అడ్డగించారు. తాము పోలీసులమని, ముందర మా పెద్ద సార్లు తనిఖీలు చేస్తున్నారని, బంగారు చైన్, రెండు ఉంగరాలు ప్యాక్ చేసి స్కూటీ డిక్కీలో పెట్టుకోవాలని చెప్పారు. బంగారాన్ని తీయగా నిందితులు ఓ కాగితంలో ప్యాక్ చేసి వారి వద్ద ఉన్న రోల్డ్ గోల్డ్ బంగారాన్ని డిక్కీలో పెట్టారు. మూడున్నర తులాల అసలు బంగారాన్ని ఎత్తుకెళ్లారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు క్లూస్ టీంలను రంగంలోకి దించి నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

## కార్పొరేట్ శక్తుల కోసమే

# నూతన విద్యావిధానం

డిచ్‌పల్లి, మార్చి 12 : కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తున్నదని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆరోపించారు. టీయూ ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో మంగళవారం విద్యార్థుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతన విద్యావిధానం, ప్రైవేటీకరణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ పున్నయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. నూతన విద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ యూనివర్సిటీలు దివాళా తీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగానికి సరిపడా బడ్జెట్ కేటాయించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ప్రయోజనం లేదన్నారు. యువత, విద్యార్థిలోకం పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు.






మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

## ఎక్కాలు చెప్పడం లేదని

# కర్రతో కొట్టిన ఉపాధ్యాయుడు

**విద్యార్థి కంటికి గాయం**

బాల్కొండ, మార్చి 12: ఎక్కాలు (టేబుల్స్) చెప్పడం లేదని ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడంతో ఓ విద్యార్థి కన్నుకు తీవ్రగాయమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎద్దండి శ్రీరామ్ తొమ్మిదో తరగతి (ఎ–సెక్షన్) చదువుతున్నాడు. సోమవారం తరగతి గదిలో గణితం ఉపాధ్యాయుడు శ్రీరామ్‌ను ఎక్కాలు అడిగాడు. విద్యార్థి చెబుతుండగా 'ఇంకా ఎన్ని రోజులు నేర్చుకుంటావు' అంటూ చేతిలో ఉన్న కర్రతో కొట్టాడు. దీంతో శ్రీరామ్ ఎడమ కన్నుకు తీవ్ర గాయమైంది. కంట్లో నుంచి రక్తం రావడంతో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థిని ఆర్మూర్‌లోని ఓ కంటి దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. విద్యార్థి కన్ను సరిగా కనిపించడం లేదని, కంటి చూపుపోతే ఆయన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థి తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని స్థానికులు తెలిపారు.



గాయమైన కన్ను